క్లుప్తంగా

ఎమ్మెల్యే శంబంగికి సత్కారం



ఎమ్మెల్యే శంబంగిని సత్కరించిన కళింగ వైశ్య సంఘ కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: పట్టణ కళింగ వైశ్య సంఘ నూతన కార్యవర్గం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును ఘనంగా సత్కరించింది. ఇటీవల ఎన్నికైన ఈ కార్యవర్గం శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చి శంబంగిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో నారంశెట్టి శ్రీనివాస గుప్తా, వారణాసి గణేష్, కెంగువ శ్రీనివాస రావు, జీవీ సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటరు సర్వే



రేగిడి: సంకిలిలో సర్వే చేస్తున్న బీఎల్ఓ గోపాలరావు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన సర్వే చురుగ్గా జరుగుతోంది. సంకిలి, ఆమదాలవలస, వండానపేట, గుళ్లపాడు గ్రామాల్లో బీఎల్ఓలు నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి శనివారం పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడి పేరు, చిరునామా, ఇతర వివరాలు సేకరించారు. సర్వే సక్రమంగా చేపట్టాలని బీఎల్ఓలకు సూచించారు.

ఇంటింట సర్వే పరిశీలన

బొబ్బిలి: ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బొబ్బిలిలో శనివారం చేపట్టిన ఇంటింట సర్వేను తహసీల్దార్ డోల రాజేశ్వర రావు పరిశీలించారు. ఇంటి నంబర్లు, చిరునామా, ఫోన్ నంబర్లతో పాటు సవరణ ప్రక్రియలోని అన్ని అవకాశాలనూ ఓటర్లకు కల్పిస్తున్నారా.. లేదా అన్న విషయమై ఆరా తీశారు. వచ్చే నెల 21 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు క్రమంతప్పకుండా పాల్గొనాలని సూచించారు.

ఆటపాటలతో కూడిన విద్య అందించాలి

● ఎంఈఓ త్రినాథరావు



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని మండల విద్యాశాఖాధికారి జె. త్రినాథరావు అన్నారు. శనివారం స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రీస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యకర్త వై.శ్రీదేవి ఆటపాటలతో కూడిన విద్య అందిస్తుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

పోటెత్తిన బందిగెడ్డ



వన్నలిలో చెరకుపంటలోకి చేరిన నీరు

రేగిడి: మండలంలో లింగాలవలస, అంబఖండి, వన్నలి, ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం గ్రామాలకు అనుసంధానంగా ఉన్న బందిగెడ్డ వరదనీటితో పోటెత్తింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరుతుండడంతో బందికాలువ పొంగి ప్రవహిస్తోంది. దీంతో సమీప పంట పొలాలు నీటమునిగాయి.

చెరువులకు జలకళ



రాజాం మండలం లక్ష్మీపురంలో నీటితో నిండిన పెద్దచెరువు

రాజాం: ఇటీవల కురిసిన వర్షాలకు సాగునీటి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో సాగునీటి కాలువలు, చెరువుల కింద అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సాగునీటి చెరువులు కాలువల్లో నీరు చేరడంతో ఖరీఫ్ అవసరాలకు నీటి ఇబ్బందులు ఉండవని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సంతకవిటి మండలం మందరాడలో జలకళతో పెద్దచెరువు

అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం : కొండంపేటలో సంక్షేమ బుక్‌లెట్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు.

రాజాం: ఎటువంటి రాజకీయ ప్రలోభాలు లేకుండా అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణం పరిధిలోని కొండంపేట గ్రామంలో శనివారం 'గడపగడపకుమ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లు లబ్ధిదారులకు అందజేశారు. అందులో ఉన్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ నాలుగేళ్లలో నేరుగా ప్రతీ ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం రూపంలో రూ. 1 లక్ష నుంచి రూ.4 లక్షలకు పైగా అందజేశామన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే పథకాలు అందించేదని, ఐదేళ్లు రాష్ట్రాన్ని టీడీపీ నేతలు దోచుకున్నారని దుయ్యబట్టారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజీకి ఆశపడి ప్రభుత్వాన్ని దూషిస్తున్నాడని, ప్రజలు అతనికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ ముద్దన సత్యారావు, సలదీ తులసీదాస్ మాస్టార్, వి.ప్రసాద్, పి.కృష్ణ, దివిలి వెంకటరావు, దాకరపు శివ, వంజరాపు విజయ్‌కుమార్, వెంపల లక్ష్మణరావు, వెంకటనాయుడు, జేసీబీ శ్రీను, విజయ్, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జోగులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాన రహదారులు పక్కన, పాఠశాలలు, కళాశాలల ఆవరణంలో, చెరువులు, కాలువల గట్లపైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కల సంరక్షణతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందన్నారు. వివిధ రకాలకు చెందిన 150 మొక్కలను అందించిన బి డాట్ ఫౌండేషన్ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, బి డాట్ ఫౌండర్ బూరాడ తేజేశ్వరి, డైరెక్టర్ బూరాడ సతీష్, కళాశాల అధ్యాపకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం



గీతాపారాయణం చేస్తున్న భక్తులు

రేగిడి: ఆధునిక కాలంలో మానవుడిని వేధిస్తున్న అన్ని సమస్యలకు భగవద్గీత సమాధానం చూపించిందని శ్రీవైష్ణవ ఆచార్య పీఠం అనువంశిక గురువులు రంగనాథం అయ్యవార్లు అన్నారు. పీసపాటి అప్పల సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో గీతామండలి సభ్యులు సంకల్పించిన భగవద్గీత అష్టాదశ క్షేత్ర పారాయణ మహాయజ్ఞంలో భాగంగా మండలంలో పనసలవలస రాజావేణుగోపాలస్వామి ఆలయంలో తొలిపారాయణం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. శ్రీమన్నారాయణుని మనసారా ఆరాధించడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. భగవద్గీతను 18 గోపాల క్షేత్రాల్లో పారాయణం చేయాలని సంకల్పించినట్లు అప్పలసూర్యనారాయణాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో నరసన్నపేటకు చెందిన గీతామండలి సభ్యులు, పనసలవలసతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పాన్‌షాపుల్లో చోరీ

బొబ్బిలి: పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద గల రెండు పాన్‌షాపుల్లో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. త్రినాథ, గుప్తలకు చెందిన షాపుల్లో సిగరెట్లు, ఇతర వస్తువులతో పాటు రూ. 3,500 నగదు దోచుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్రవజీవామృతంతో చీడపీడల నివారణ



ద్రవజీవామృతం తయారీని వివరిస్తున్న సాంబ్రో

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటల్లో చీడపీడల నివారణకు ద్రవజీవామృతం వినియోగించాలని ఏపీసీఎన్ఎఫ్ ఐసీఆర్‌పీ వి.సాంబ్రో, వెలుగు ఎస్ఓ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని చింతలగూడలో ప్రకృతి వ్యవసాయం, చీడపీడల నివారణ, జీవామృతాల తయారీపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. వరితో పాటు పండ్ల తోటలు, కూరగాయల పంటల్లో సస్యరక్షణకు ద్రవజీవామృతాన్ని వినియోగించవచ్చన్నారు. ప్రకృతిలో అందుబాటులో ఉండే పదార్థాలతో దీన్ని సులభంగా తయారు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వెలుగు ప్రతినిధి భాగ్యలక్ష్మి, సీఎఫ్ కమల పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



అవార్డులు పొందిన విద్యార్థులతో సీఐలు రవికుమార్, ఉపేంద్ర, తదితరులు

రాజాం సిటీ: విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా ఎంచుకున్న రంగంలో లక్ష్యంవైపు పయనించి లక్ష్యసాధనకు కృషిచేయాలని రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.రవికుమార్, హెచ్.ఉపేంద్ర అన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్థానిక సిరి కల్యాణ మండపంలో శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి సీఐలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచిచెడులపై అవగాహన పెంపొందించుకోవాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 584 మార్కులతో జిల్లాలో తృతీయస్థానంలో నిలిచిన రేగిడి అక్షిత ఉన్నత చదువులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్ హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న ట్యూషన్ టీచర్ పి.రామును సత్కరించారు.
కార్యక్రమంలో ఎస్సై పి.నీలావతి, విద్యుత్‌శాఖ ఏఈ కుమార్, జె.నీలయ్య, ఆర్.జయరాం, ఎ.శ్రీను, పి.రామారావు, పద్మావతి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

గరుగుబిల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్లు పాడవటం, విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని మరుపెంట పంచాయతీ తులసిరామినాయుడు వలసలో 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు. ఏఈ బి.శంకరరావు పర్యవేక్షణలో సిబ్బంది వైర్లను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా చేపట్టాలి

వీరఘట్టం: మండలంలోని 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సోషల్ ఆడిట్ బృందాలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం, ఐటీడీఏ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రూ.17.11 కోట్ల వ్యయంతో 816 పనులు చేపట్టినట్లు తెలిపారు.

పనుల నాణ్యత, ఖర్చు తదితర వివరాలను పక్కాగా ఆడిట్ చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, ఏపీఓ జి.సత్యంనాయుడు, ఎస్ఆర్‌పీలు గోవిందరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న

● ఆరోగ్య ప్రయోజనాలు అధికం
● కొనుగోలుకు మొగ్గుచూపుతున్న ప్రజలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పొత్తులు

రాజాం సిటీ: మొక్కజొన్న సీజన్ ఆరంభమైంది. వర్షాకాలంలో వేడివేడిగా కాల్చిన మొక్కజొన్న పొత్తులను తినేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. దీంతో మార్కెట్లో వీటికి డిమాండ్ పెరుగుతోంది. ఇందులో అధిక మొత్తంలో ఉన్న ప్రోటీన్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

మొక్కజొన్నలో పీచు పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు బాగా పనిచేస్తుంది. ఆహారంలో పీచు ఉంటే అది మలబద్ధకం, మొలలు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. పేగు కేన్సర్‌ను అరికడుతుంది. ఇందులో మెగ్నీషియం, ఐరన్, కాపర్, ఫాస్పరస్ వంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలు గట్టిపడేలా చేస్తాయి. అంతేకాకుండా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు సహకరిస్తాయి. మొక్కజొన్నలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంతో తోడ్పడతాయి. ఈ గింజల నుంచి తీసిన నూనెలో లీనోలేయాసిడ్ ఉంటుంది. ఇది చర్మంపై మంటలను, ర్యాషెస్‌ను తగ్గిస్తుంది. ఇందులో ఐరన్, ఫోలిక్‌యాసిడ్ రక్తహీనత నుంచి కాపాడుతుంది. అంతేకాకుండా కొలన్ క్యాన్సర్ నివారణకు, డయాబెటిస్ నియంత్రణకు మొక్కజొన్న మేలు చేస్తుంది.

తింటే మంచిదని..

మొక్కజొన్న తింటే మంచిదని తెలిసి ఎప్పటికప్పుడు కొనుక్కొని తింటుంటాం. మొక్కజొన్నతో చేసిన కర్రీ, ఇతర వంటకాలను ఇంట్లో అందరూ ఎంతో ఇష్టంగా తింటాం. అందరికీ అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి.

– పి.సుజాత, గృహిణి, దోలపేట

చిన్నపిల్లలకు మితంగా పెట్టాలి

మొక్కజొన్న పొత్తులు చిన్నపిల్లలు కూడా ఇష్టంగా తింటుంటారు. అయితే గింజలు ముదిరినవి అయితే అరుగుదల ఇబ్బందులు ఏర్పడతాయి. కాబట్టి చిన్న పిల్లలకు మితంగా పెడితే మంచిది. సాధ్యమైనంత వరకు లేతవి మాత్రమే పిల్లలకు ఇవ్వాలి.

– ఆర్.పద్మావతి, గృహిణి, రాజాం

మొక్కజొన్న ఆహారంలో తీసుకోవాలి

ఈ సీజన్‌లో లభించే మొక్కజొన్నతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఆహారంలో మొక్కజొన్నలను తీసుకోవడం ద్వారా శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, కొన్నిరాకల పోషకాలు పుష్కలంగా అందుతాయి. రక్తహీనతను తగ్గించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్ నియంత్రించడం, మూత్రపిండాల పనితీరును వృద్ధిచేసేందుకు ఉపయోగపడుతుంది.

– డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

'జగనన్న సురక్ష'తో అందరికీ లబ్ధి



రేగిడి: తోకలవలసలో అర్జీదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు



రాజాం: లబ్ధిదారులకు రైస్‌కార్డులు అందిస్తున్న సర్పంచ్ బోడమ్మ

రేగిడి: జగనన్న సురక్షతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతోందని, గ్రామాల్లో ఏళ్లుగా ఉన్న సమస్యలు పరిష్కారం అవుతున్నాయని వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. మండలంలోని తోకలవలస గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, సర్పంచ్ సూర్యకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల ఉమామహేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాజాం: మండలంలో పెనుబాక సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన రైస్‌కార్డులను సర్పంచ్ బండి బోడమ్మ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బండి నర్సింహులు మాట్లాడుతూ.. వివిధ సాంకేతిక కారణాలతో గ్రామంలోని 15 మందికి రైస్‌కార్డులు మంజూరు కాలేదని, ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారంతా దరఖాస్తు చేసుకోగా సమస్య పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ అప్పలనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



గుమ్మడివలసలో కళ్ల కలకలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రామభద్రపురం: కళ్ల కలకలు సోకకముందు, సోకిన తర్వాత జాగ్రత్తలు పాటించాలని ఎంఎల్‌హెచ్‌పీ పి. దివ్య అన్నారు. మండలంలోని రావివలస, చందాపురం, చదరడవలస, గుమ్మడివలస, కొండగుడ్డివలస, లొల్లరపాడు, ఆర్. చింతలవలస, తదతర గిరిజన గ్రామాలలో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గుమ్మడివలసలో ఎక్కువ మంది గిరిజనులకు కళ్ల కలకలు సోకడంతో అవగాహన కల్పించారు. కలకలు వచ్చిన వారు ఎక్కువసార్లు చల్లని మంచినీటితో కళ్లు కడగాలని సూచించారు. అలాగే పీహెచ్‌సీలో ఉచితంగా పంపిణీ చేసే సిప్రాఫ్లాక్సిన్ కంటి మందు రోజుకు 4 నుంచి 5 సార్లు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న సీఐ తిరుమలరావు

● సీఐ తిరుమలరావు

రామభద్రపురం: జాతీయ రహదారులపై అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందనలు



సత్కారం అందుకున్న బదిలీ ఉపాధ్యాయులు

బొబ్బిలి: పార్వతీపురం – మన్యం జిల్లా మక్కువ మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాలకు బదిలీ కావడం.. అలాగే వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు మండలానికి రావడంతో ఆ మండల వాసులు బొబ్బిలి ఎన్‌జీఓ హోమ్‌లో ఆత్మీయ కలయిక, వీడ్కోలు సభ శనివారం నిర్వహించారు.
యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె. విజయగౌరి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన, వచ్చిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఈఓ -2 గొట్టాపు వాసు, తదితరులు పాల్గొన్నారు.

దేశవాళీ విత్తనాలతో అధిక దిగుబడులు



విత్తనాలు పంపిణీ చేస్తున్న మాతోట జీవ ప్రాజెక్టు సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: దేశవాళీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మాతోట జీవప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు తాడంగి జమ్మయ్య అన్నారు. మండలంలోని గొరడ గ్రామంలో ప్రాజెక్టు పరిధిలోని గొరడ, రాయగడ జమ్ము, కెంగువ, వల్లాడ గ్రామాలకు చెందిన 40మంది రైతులు తయారు చేసిన దేశవాళీ విత్తనాలను శనివారం ప్రదర్శించారు. విత్తన మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందవచ్చన్నారు. పండ్ల తోటల్లో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, ఆకుకూరలు, కాయగూరలు వేసుకోవడం వలన అదనపు ఆదాయం వస్తుందన్నారు. నాబార్డు ఆర్థిక సహకారంతో జట్టు సంస్థ పరివేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు కొర్రలు, సాములు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతోట జీవ ప్రాజెక్టు కార్యదర్శి చిరంజీవులు, మురళీ పాల్గొన్నారు.